క్లుప్తంగా

రైతులకు అండగా ఆర్బీకేలు


రైతు భరోసా కేంద్రం

మాడుగుల: ఈ ఏడాది ముందుగానే అడపాదడపా వర్షాలు కురవడంతో రైతులు పచ్చిరొట్ట విత్తనాలు వేయడానికి దుక్కులు దున్నించారు. అదును ప్రకారం రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులు పంపిణీకి సిద్ధం చేశారు. మండలంలో 23 రైతు భరోసా కేంద్రాలకు 40 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేశామని, 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేస్తామని వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల రసాయన ఎరువులు వాడకం తగ్గడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు.

43 మందికి వైద్య సేవలు

మాడుగుల రూరల్: కింతలి పీహెచ్‌సీ పరిధి ఎం. కృష్ణాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా కింతలి పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి బి. రవితేజ 43 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. బీపీ, సుగర్, తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం, ఆశ, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం


శ్రీనుకు ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

నాతవరం: అనారోగ్యంతో బాధపడుతున్న సహచర విద్యార్థికి పూర్వ విద్యార్థులంతా కలిసి ఆర్థిక సాయం చేసి మనోధైర్యం కల్పించారు. డి.యర్రవరం హైస్కూల్‌లో చదివిన 2000- 01 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ తోటి విద్యార్థి అంకంరెడ్డి శ్రీను ఇంటికి సోమవారం వెళ్లారు. అతడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40 వేలు అందజేశారు. గతంలో ఇదే బ్యాచ్ హైస్కూల్‌లో పూర్వ గురువులను సత్కరించింది. హైస్కూల్‌కు పలు సేవా కార్యక్రమాలు చేసింది.

30 తులాల వెండి కాసుల పేరు బహూకరణ


అమ్మవారికి కాసులపేరు అలంకరిస్తున్న జగన్నాథరావు, విజయ దంపతులు

కె.కోటపాడు: చౌడువాడ గ్రామ దేవత పెద పైడిమాంబ అమ్మవారికి గ్రామానికి చెందిన భక్తుడు తనకాల జగన్నాథరావు 30 తులాల వెండి కాసులపేరును బహూకరించాడు. ఇక్కడ ఆలయంలో అమ్మవారి విగ్రహానికి ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో సోమవారం దాత జగన్నాథరావు, దివ్య దంపతులు వెండి నగ అలంకరించారు. మహిమాన్వితం గల అమ్మవారికి రూ.35 వేలతో తయారు చేయించిన కాసుల పేరును బహూకరించడం అదృష్టంగా భావిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 893 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,000	5,070
మొదటి రకం	4,500	4,830
రెండో రకం	3,950	4,510
మూడోరకం	3,500	4,140

క్రీడలతో మానసికోల్లాసం


రోలుగుంటలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇస్తున్న సీఆర్పీ సతీష్

కె.కోటపాడు: చదువులతోపాటు క్రీడలకు విద్యార్థులు అధిక ప్రాధాన్యమివ్వాలని గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా సోమవారం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. లెమన్ స్పూన్, కుర్చీలాట ఆడించారు. ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. శిబిరం ముగింపు రోజు వచ్చే నెల 8న విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ

రోలుగుంట: వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహణలో భాగంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథపాలకురాలు ఎస్. వరలక్ష్మి నిర్వహించారు. ఇక్కడ పాల్గొన్న విద్యార్థులతో రోలుగుంట కాంప్లెక్సు సీఆర్పీ పరవాడ సతీష్ తొలుత ఆంగ్ల పదాలను పలికించారు. తర్వాత పదాలను కలిపి చిన్న వాక్యాలు తయారు చేయించారు. ఇష్టమైన ఆటలు, తినుబండారాలు, క్రికెట్ ఆటగాళ్లు ఏయే దేశాల నుంచి వచ్చి వారి ప్రతిభ చూపుతున్నారు, తదితర వాటిని చిన్న చిన్న వాక్యాల్లో రాయించారు. మరో రెండు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుందని గ్రంథపాలకురాలు తెలిపారు.


కె.కోటపాడు: చౌడువాడలో లెమన్ స్పూన్ పోటీల్లో విద్యార్థులు

ఉపాధి హామీ ఫీల్డ్ సిబ్బందిపై ఫిర్యాదు

రావికమతం: ఫీల్డ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ టి.అర్జాపురం గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం జాబ్ కార్డుదారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. గ్రామంలో పని కావాలంటే ఫీల్డ్ సిబ్బంది డబ్బులు అడుగుతున్నారని, ఇవ్వని వారికి ఆరు రోజులు పనికెళ్లినా నాలుగు రోజులే మస్తర్లు వేస్తున్నారని వాపోయారు. దీంతో తాము పని చేస్తున్నా, గిట్టుబాటు కావడం లేదని నిరసన చేపట్టారు. దీంతో ఎస్‌ఐ ధనంజయ్‌నాయుడు అక్కడికి చేరుకుని 144 సెక్షన్ అమలులో ఉన్నందున నిరసనలు చేపట్టరాదని, ఫిర్యాదు ఇచ్చి వెళ్లిపోవాలని సూచించారు. ఆ మేరకు అక్కడ కార్యాలయ సూపరింటెండెంట్ సన్యాసిరావుకు ఫిర్యాదు చేశారు.


సూపరింటెండెంట్ సన్యాసిరావుకు ఫిర్యాదు చేస్తున్న జాబ్ కార్డుదారులు

సుర్రుమన్న సూరీడు

మాడుగుల రూరల్: వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఒక వైపు ఉక్కపోత, మరో వైపు ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడుపోతున్నారు. రోహిణి కార్తెలు ప్రారంభంతో సోమవారం తీవ్రంగా ఎండ కాసింది. ఆపై ఉక్కపోతతో ప్రజలు విలవిలలాడారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బుచ్చెయ్యపేట: మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తాడి వెంకటాచార్య తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

నేడు పెద పైడిమాంబ పెద్ద పండగ

జిల్లా నలుమూలల నుంచి తరలిరానున్న భక్తులు


పెద పైడిమాంబ అమ్మవారి ఆలయం

కె.కోటపాడు: చౌడువాడ గ్రామ దేవత పెద పైడిమాంబ అమ్మవారి పెద్ద పండగను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి పండగను ఐదేళ్లకోసారి నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఆది, సోమవారాల్లో ఇక్కడ ఆలయ ప్రాంగణంలో భారీ ప్రభ ప్రదర్శించారు. ఊరికట్టు కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాలకు ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వెళ్లిన వారు అమ్మవారి పెద్ద పండగ సందర్భంగా తిరిగి గ్రామానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. మరోవైపు గ్రామాన్ని, గుడిని విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయంలో దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.


గ్రామంలో విద్యుద్దీపాలంకరణ

క్షయ నివారణపై ప్రత్యేక దృష్టి

జిల్లా క్షయ వ్యాధి నివారణ సమన్వయకర్త అయ్యప్పరెడ్డి

మాడుగుల రూరల్: క్షయ వ్యాధి నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా క్షయ వ్యాధి నివారణ సమన్వయకర్త కె. అయ్యప్పరెడ్డి అన్నారు. సోమవారం ఆయన కె.జె.పురం పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలించారు. ఇక్కడ కేసులు వివరాలు గురించి వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాదులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు పీహెచ్‌సీలో మందులు అందిస్తామన్నారు. వీరికి ప్రభుత్వం రూ.500 పింఛను అందిస్తుందన్నారు. పీహెచ్‌సీలో ఉచిత క్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి సీహెచ్ పుష్పమ్మ, ల్యాబ్ టెక్నీషియన్లు నాయుడు, కోటి, సిబ్బంది ఈశ్వరరావు పాల్గొన్నారు.


వైద్యాధికారితో మాట్లాడుతున్న అయ్యప్పరెడ్డి

సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండుగ 18కు వాయిదా

దేవరాపల్లి: స్థానిక గ్రామ దేవత సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండుగను వచ్చే నెల 18న అంగరంగ వైభవంగా నిర్వహించాలని గ్రామ పెద్దలంతా నిర్ణయించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం జూన్ 4న పండగ జరగాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతోపాటు అదే రోజు ఓట్ల లెక్కింపు జరగనుండటంతో పండగ వాయిదా వేసుకోవాలని ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడుకు ఎస్‌ఐ డి. నాగేంద్ర సూచించారు. ఆ మేరకు స్థానిక రామాలయంలో గ్రామ పెద్దలతో సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామ పెద్దల అభిప్రాయం మేరకు వచ్చే నెల 18న అమ్మవారి ఒడ్డు పండుగ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ రోజున పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకోవాలని ఆలయ ధర్మకర్త విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, మహేశ్వరీ నాయుడు, కె.వి.రమణ, జాగరపు అబద్ధం, చొక్కాకుల రమణ తదితర గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.


గ్రామ పెద్దలతో సమావేశమైన ఆలయ ధర్మకర్త లలితానాయుడు

మళ్లీ పెన్షన్ టెన్షన్



- తలలు పట్టుకుంటున్న అవ్వాతాతలు
- తలుపు తట్టి పింఛనిచ్చిన వలంటీర్లు దూరం
- నియోజకవర్గంలో 33,910 మంది పింఛనుదారులు
- 25 వేల మంది వృద్ధులకు బ్యాంకుల్లోనే నగదు జమ

అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వు చిన్నబోతోంది. ఒకటో తారీఖు వస్తోందంటే.. పింఛన్ అందుకుంటామన్న ఆనందం కంటే.. బ్యాంకులు, సచివాలయాల వద్ద పడే వ్యయ ప్రయాసలు గుర్తుకొచ్చి గుబులు రేగుతోంది. రెండు నెలలుగా పింఛన్ కోసం వారు అనుభవించిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు మరో నెల వస్తోంది. తిప్పలు మాత్రం తప్పేలా లేకపోవడంతో, ఈ ఎండల్లో ఎలారా భగవంతుడా..? అంటూ వాపోతున్నారు.

తుమ్మపాల: గత ప్రభుత్వంలో పింఛన్ కోసం అధికారుల ముందు చేతులు కట్టుకుని, వారు ఎప్పుడిస్తే అప్పుడే మహద్భాగ్యం అనుకునే పరిస్థితి. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల జీవితాల్లో సామాజిక గౌరవాన్ని పెంచాలన్న సీఎం జగన్ ఆకాంక్ష వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్ల పంపిణీతో నెరవేరింది. లబ్ధిదారుల గౌరవానికి భంగం లేకుండా, వారి జీవితాలకో భరోసా ఇచ్చింది. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో ఉన్నా, తప్పనిసరి పరిస్థితుల్లో వేరే ఊరికి వెళ్లినా.. వలంటీర్లు వారిని వెతుక్కుంటూ వెళ్లి ప్రతి నెలా ఒకటో తేదీనే వారి యోగక్షేమాలు తెలుసుకుని మరీ, పింఛన్ అందించేవారు. టీడీపీ, దాని మిత్రపక్షాల కుట్రలు, ఎన్నికల సంఘం ఆదేశాలతో గత రెండు నెలలు పింఛన్ అందుకోవడానికి లబ్ధిదారులు పడ్డ తిప్పలు వర్ణనాతీతం. ఇప్పుడు జూన్ నెల పింఛన్ కోసం కూడా అవే తిప్పలు తప్పని పరిస్థితి.

25 వేల మందికి బ్యాంకుల్లోనే నగదు జమ

అనకాపల్లి నియోజకవర్గంలో ప్రస్తుతం 33,910 మంది పింఛనుదారులున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు దాదాపు రూ.571 కోట్ల నగదు లబ్ధిని వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే అందించింది. ప్రతి నెల సుమారు రూ.10 కోట్ల మేర పంపిణీ జరుగుతోంది. తాజాగా పెంచిన రూ.3 వేల పింఛన్‌తో ప్రధాన కేటగిరీలైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలతోపాటు ఇతర పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వలంటీర్లే వెళ్లి పింఛన్ నగదు అందించేవారు. ఎన్నికల నేపథ్యంలో విపక్షాల ఫిర్యాదుపై ఈసీ ఆదేశాల మేరకు వీరిలో 25,606 మందికి బ్యాంకుల్లోను, 8,304 మందికి సచివాలయ సిబ్బంది నేరుగా వారిళ్లకు వెళ్లి పింఛన్ లబ్ధి అందిస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకుల్లో నగదు తీసుకోవడం అవ్వాతాతలకు తలకు మించిన భారంగా మారింది.

భయపెడుతున్న పాత రోజులు

టీడీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్లు తీసుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రతి నెల ఒకటో తేదీ దాటినా.. పింఛన్ ఎప్పుడు ఇస్తారో తెలియక ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాచేవారు. బారులు తీరి గంటల కొద్ది క్యూలో నిల్చున్న రోజులను నేటికీ మరచిపోలేదు. వేసవి కాలంలో క్యూలైన్లలో నిల్చోలేక సొమ్మసిల్లిన లబ్ధిదారుల సంఖ్య లెక్కపెట్టలేనంత. ఆ జ్ఞాపకాలు వృద్ధుల్ని వెంటాడుతూనే ఉన్నాయి. వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబు తమకు పాత రోజులు గుర్తు చేస్తున్నారంటూ వాపోతున్నారు. ఎంత వేగంగా ఈ కష్టాలు తీరతాయా? అని నిరీక్షిస్తున్నారు.

ప్రధాన పింఛన్లు, లబ్ధి

కేటగిరీ	లబ్ధిదారులు	నగదు లబ్ధి
వృద్ధులు	17,211	రూ.5.16 కోట్లు
వితంతువులు	9,926	రూ.2.97 కోట్లు
దివ్యాంగులు	4,139	రూ.1.24 కోట్లు
ఒంటరి మహిళలు	810	రూ.24.30 లక్షలు

మండలాల వారీగా పింఛన్ వివరాలు

మండలం	డీబీటీ	డోర్ టు డోర్	నగదు లబ్ధి రూ. కోట్లలో
అనకాపల్లి	9,685	3,463	3.86
కశింకోట	8,179	2,422	3.10
అనకాపల్లి టౌన్	7,742	2,419	3.03
మొత్తం	25,606	8,304	9.99

మళ్లీ అవే తిప్పలు



ఒకటో తేదీ వస్తోందని ఆనందపడాలో, పింఛన్ కోసం పడే తిప్పలు తలచుకుని బాధపడాలో అర్థం కావట్లేదు. పింఛను తీసుకోవాలంటే బ్యాంక్‌కు వెళ్లాలి. ఇంటి నుంచి పట్టణంలో ఉన్న బ్యాంక్‌కు వెళ్లగలిగే పరిస్థితిలో లేను. నా వయస్సు 80 ఏళ్లు. ఇంటి నుంచి బయటకే రాలేను. అలాంటిది బ్యాంక్‌కి నన్నెవరు తీసుకెళ్తారు. వలంటీర్ల ద్వారా పింఛను పంపిణీ చేయకుండా అడ్డుకోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నా. గత నెలలో పడిన బాధలు మళ్లీ గుర్తుకొస్తున్నాయి. ఇంకెన్ని రోజులు మాకీ బాధలు.

–మంతిన సీతామహాలక్ష్మి, తారకరామ కాలనీ

ఆకర్షణీయంగా ఆర్‌అండ్‌బీ వసతి గృహం


మాడుగులలో ఆర్‌అండ్‌బీ వసతి గృహం

మాడుగుల: సకల సౌకర్యాలతో కార్పొరేట్ సొబగులు అద్దుకున్న ఆర్‌అండ్‌బీ వసతి గృహం మాడుగులకే వన్నె తెస్తోంది. గతంలో దీని స్థానంలో బ్రిటీష్ వారు నిర్మాణం చేపట్టిన బంగ్లా ఉండేది. ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరి వినియోగంలో లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు బస చేయడానికి ఇబ్బంది పడుతుండటంతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.1.40 కోట్లతో అధునాతన సదుపాయాలతో నూతన వసతి గృహం నిర్మించారు. ఇది ప్రస్తుతం పట్టణ ప్రవేశ మార్గంలో ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలి

ఎంపీడీవో జాన్ లింకన్

రోలుగుంట: చెత్తతో సంపద తయారీ కేంద్రాలను మరింత అభివృద్ధి చేసి వినియోగంలోకి తేవాలని ఎంపీడీవో జాన్ లింకన్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా చెత్తతో సంపద తయారీ కేంద్రాల ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. ప్రతి కార్యదర్శి సంపద తయారీ కేంద్రాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. వారం రోజులుగా పడుతున్న వర్షాల నేపథ్యంలో వీధి కాలువల్లో గాని, గ్రామాల్లో గాని ఎక్కడైనా నీటి నిల్వలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యే వాటరు ట్యాంకులను శుద్ధి చేయాలన్నారు. వీధుల్లో ఎక్కడా చెత్తకుప్పలు ఉండకుండా సంపద తయారీ శాలలకు తరలించాలన్నారు. కాలువల్లో పూడికలు తీయించాలన్నారు. పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. సచివాలయాలను చెత్తతో సంపద తయారీ శాలలను పర్యవేక్షించి అవసరమైన సూచనలు చేయాలని ఈవోపీఆర్డీ నూకరాజుకు సూచించారు.


పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఎంపీడీవో జాన్ లింకన్

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

దేవరాపల్లి: రైవాడ పంచాయతీ శివారు బేతపూడిలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రైవాడ పంచాయతీతో పాటు దేవరాపల్లి నుంచి అధికంగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి సంతరించుకుంది. అనంతరం రాత్రికి తెరపై సినిమాలు ప్రదర్శించారు. ఆలయ ధర్మకర్త పి. ధర్మారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


బేతపూడిలో అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తజనం

ఉత్సాహంగా వంటల పోటీలు


మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఎంఈవో -2 వరహాలబాబు

నాతవరం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలుతోపాటు విద్యార్థులకు రుచికరంగా వండి పెట్టాలని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. ఈ విషయమై సోమవారం స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సరుకులతో రోజూ మెనూ ప్రకారం వంటకాలు చేయాలన్నారు. కొన్ని పాఠశాలల్లో నిర్వాహకులు మొక్కుబడిగా వంటకాలు చేస్తున్నట్టు గతంలో ఫిర్యాదులు వచ్చాయన్నారు. అలాంటి సంఘటనలు దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మండల స్థాయిలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో డి.యర్రవరం హైస్కూల్ నిర్వాహకులు ప్రథమ, నాతవరం హైస్కూల్ నిర్వాహకులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎంఈవో -2 వరహాలబాబు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సీఆర్పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయం

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద అదే ప్రాంతానికి చెందిన జ్యోతికిరణ్ గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయపడ్డాడు. కాలికి తీవ్ర గాయమయింది. స్థానికుల సహాయంతో హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు.


క్షతగాత్రుడిని తరలిస్తున్న దృశ్యం